సాక్షి ఏలూరు

మంగళవారం । 10 । జూన్ । 2025



రేపు క్యాంపస్ డ్రైవ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు ప్రభుత్వ ఐటీఐ, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఈనెల 11న క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. 08812-230269లో సంప్రదించవచ్చు.



నేత్రపర్వం.. శ్రీవారి గ్రామోత్సవం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో స్వామి వారి గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ నమ్మాళ్వార్ తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని వేడుక నిర్వహించారు.



సప్త ప్రదక్షిణలు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారాల ప్రదక్షిణలు ప్రారంభించినట్టు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

సంక్షేమానికి తూట్లు.. సంక్షోభం నిండేట్లు

● నాడు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించారు.. పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టారు.. ఇంటి ముంగిళ్లలోకే సర్కారీ సేవలను అందించి పాలనలో కొత్త ఒరవడిని సృష్టించారు. విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు.. మహిళా సాధికారత లక్ష్యంగా పథకాలు అందించారు.. అన్నదాతలకు స్థానికంగా సేవలందించేలా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేశారు. గిరిపుత్రులకు నేనున్నానంటూ.. ఆరోగ్య భరోసా కల్పించారు. నాటి పాలనలో సంక్షేమం, సుభిక్షం పరవళ్లు తొక్కాయి.

● నేడు


టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఏడాది పాలనలో సం'క్షామం', సంక్షోభంతో ప్రజలు అల్లాడుతున్నారు. విద్య, వైద్యరంగాలు పూర్తిగా నిర్వీర్యం కాగా.. ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరమవుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలును గాలికొదిలేస్తూ సంక్షేమాన్ని దూరం చేస్తున్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారు. పథకాలు అమలు చేయకుండా మొండిచేయి చూపడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు భవితవ్యం అయోమయంగా మారింది. ఇలా ప్రజా జీవనాన్ని ఏడాది పాలనలో అస్తవ్యస్తం చేసిన ఘనత కూటమి సర్కారుకే దక్కుతుంది.

కూటమి కక్ష

- సంక్షేమ, అభివృద్ధి పథకాల్లేవు
- ఎండీయూ వాహనాలు రద్దు
- విద్య, వైద్య రంగాలు నిర్వీర్యం
- సచివాలయ వ్యవస్థపై శీతకన్ను
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యమే లక్ష్యం
- సచివాలయాల్లో 543 సేవలు
- ఇంటింటా సంక్షేమ పరవళ్లు



ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్దనే రేషన్ అందిస్తున్న దృశ్యం (ఫైల్)



ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం రైతుల నడ్డి విరిచింది. ఏడాది పాలనలో పెట్టుబడి సాయం ఒక్క రూపాయి ఇవ్వకపోగా.. పంటలకు గిట్టుబాటు ధరలు కూడా కల్పించలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జిల్లాలో 2,35,847 మంది రైతులకు రైతు భరోసా కింద రూ.1,839.24 కోట్ల లబ్ధి చేకూర్చారు. అలాగే 97,584 మంది రైతులకు సున్నా వడ్డీ పంట రుణాల కింద రూ.97.29 కోట్లు అందించారు. ఉచిత విద్యుత్ కింద 70,960 సర్వీసులకు రూ.2467.25 కోట్లు ఖర్చు చేశారు. రూ.60.94 కోట్లతో సుమారు 228 రైతు భరోసా కేంద్రాలు నిర్మించి రైతులకు సేవలందించారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఈ కేంద్రాలు నిరుపయోగంగా మారుతున్నాయి.

గ్రామీణ వైద్యంలో విప్లవం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటికే వైద్య సేవలందించారు. కూటమి ప్రభుత్వంలో ఈ విధానం అమలు కావడం లేదు. రూ.39.86 కోట్లతో 178 హెల్త్ క్లినిక్స్ నిర్మాణం చేపట్టి పల్లెల్లో మెరుగైన వైద్య సేవలందించారు.

విద్యారంగం.. మహోన్నతం

గత ప్రభుత్వంలో విద్యారంగంలో సంస్కరణకు మాజీ సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. జిల్లాలో 2,032 బడులను నాడు-నేడు పథకంలో రూ.270.75 కోట్లతో ఆధునికీకరించారు. ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ బోధనలు అమలులోకి తెచ్చారు. నేడు కూటమి సర్కారులో నాడు-నేడు పథకాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

రేషన్ వాహనాల రద్దు : జిల్లాలో ప్రతి కుటుంబానికీ తమ ఇంటి సమీపంలోనే రేషన్ అందించేలా 395 వాహనాలను జిల్లాలోని 1,123 రేషన్ షాపులకు గత ప్రభుత్వం అనుసంధానం చేసింది. అలాగే వాహనంలో ఇద్దరికి చొప్పున ఉపాధి కల్పించింది. ఇలా జిల్లాలోని 6,31,044 కార్డుదారులకు ప్రతి నెలా 8,791.03 టన్నుల బియ్యం, 218.75 టన్నుల పంచదార, కందిపప్పు, గోధుమ పిండి, ఆయిల్ ప్యాకెట్లను పంపిణీ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలను రద్దు చేసి ప్రజలకు ఇంటి వద్దనే రేషన్ అందుకునే సౌకర్యాన్ని దూరం చేసింది.

అందరికీ 'గృహ'యోగం

గత ప్రభుత్వంలో జిల్లాలో 1,16,431 మందికి ఇళ్ల పట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి అందించింది. 98,874 ఇళ్ల నిర్మాణాల కోసం రూ.713.17 కోట్లు ఖర్చు చేశారు. జిల్లాలో 654 మంది రైతులకు 524.116 ఎకరాల భూమి పంపిణీ చేశారు. 2003 నుంచి 22(ఎ)లో ఉన్న 11715.32 ఎకరాల భూమికి విముక్తి కల్పించి 9,172 మందికి మేలు కలిగించారు. నిషేధిత జాబితాలో ఉన్న 391.45 ఎకరాల భూమిని అర్హులైన 611 మందికి ఎస్సీ లబ్ధిదారులకు అందించారు. 26 గ్రామాల్లో 27.31 ఎకరాల భూమిని ఎస్సీ శ్మశాన వాటికలకు కేటాయించారు.

ఏలూరులో వైద్య కళాశాల

దశాబ్దాల కలగా ఉన్న ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. రూ.525 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం రెండేళ్లకు గానూ 300 మంది వైద్య విద్య అభ్యసిస్తున్నారు. మొదటి ఏడాది 150 మందితో ఎంబీబీఎస్ తరగతులు 2023 సెప్టెంబర్ 2న ప్రారంభిస్తే, రెండో ఏడాది 2024 సెప్టెంబర్‌లో మరో 150 మంది మెడిసిన్‌లో చేరారు.

గిరిపుత్రుల కోసం.. జిల్లాలోని ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలందించేలా గత ప్రభుత్వంలో చింతలపూడిలో 100 పడకల ఆస్పత్రి, బుట్టాయగూడెంలో రూ.55 కోట్ల వ్యయంతో 150 పడకల మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. నూజివీడులో రూ.25 కోట్లతో ఆస్పత్రి సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టారు.

గత ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యానికి బాటలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటుచేశారు. జిల్లాలో 605 సచివాలయాల్లో 4,701 మంది ఉద్యోగులను నియమించి ప్రజలకు సేవలందించారు. 443 సచివాలయ భవనాల నిర్మాణాలను రూ.193.15 కోట్లతో మొదలుపెట్టి 284 భవనాలను రూ.120.18 కోట్లతో పూర్తిచేశారు. వలంటీర్ల ద్వారా పౌర సేవలు ఇంటి వద్దకే అందించారు. అయితే ప్రస్తుత కూటమి సర్కారులో ప్రజలు, విద్యార్థులు, యువత సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. జేబులు నింపితే కానీ సర్టిఫికెట్ చేతికి రావడం లేదని పలువురు గగ్గోలు పెడుతున్నారు.



ఏలూరులో సచివాలయం, రైతు భరోసా కేంద్రం

కూటమికి గుణపాఠం తప్పదు



కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, జైళ్లకు పంపటంలో బిజీగా ఉంది. సూపర్‌సిక్స్ హామీలు అమలుకు నోచుకోలేదు. మహిళలను ఘోరంగా మోసం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుంది. ప్రభుత్వానికి చెప్పుకోవటానికి ఏమీ లేకపోవటంతో ప్రజలు నిలదీస్తారనే భయంతో దౌర్జన్యాలు చేస్తూ అణచివేసే ప్రయత్నాలు చేస్తున్నారు. భవిష్యత్తులో టీడీపీ కూటమికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– దూలం నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగాలు పీకేస్తున్నారు



ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో 3 లక్షల ఉద్యోగులను తొలగించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వడం లేదు. పేద పిల్లలను చదువులకు దూరం చేస్తున్నారు. నిరుద్యోగ భృతి మాటెత్తడం లేదు. ప్రభుత్వ చర్యలు రైతుల నడ్డివిరిచేలా ఉన్నాయి. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. వైద్య రంగాన్ని అశ్రద్ధ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నూజివీడు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

న్యూస్‌రీల్

గళమెత్తిన కార్మిక సంఘాలు



ఏలూరులో నిరసన తెలుపుతున్న కార్మికులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల అక్రమ తొలగింపులను తక్షణమే నిలిపివేయాలని, స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులు తొలగింపులు ఆపాలని, విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెనక్కి తీసుకోవాలని, విశాఖ ఉక్కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని పెద్ద పెట్టున నినదించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు డీఎన్ వీడి ప్రసాద్, కే.బుచ్చిబాబు, ఎర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు న్యాయం చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్రం రద్దు చేసిన రెండు కార్మిక చట్టాలను పునరుద్ధరించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ శంకరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు ఎస్‌డీ జబీర్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో సంఘాలకు అతీతంగా పాత్రికేయులు, రైతు సంఘ ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పనిచేసే విలేకరులు అందరికీ ప్రభుత్వ గుర్తింపు అక్రెడిటేషన్ ఇవ్వాలని, మూడు సెంట్ల చొప్పున స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా ఫెడరేషన్ కార్యదర్శి హరీష్, సీనియర్ జర్నలిస్టు కె.బాలశౌరి, ఎం.గంగరాజు, జయరాం, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్దిలో యోగాంధ్ర

ఏలూరు(మెట్రో): గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. అలాగే ఈనెల 18న కామవరపుకోట మండలం జీలకర్రగూడెం–గుంటుపల్లి బౌద్ధారామాల వద్ద యోగాసనాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు.

ఏలూరులో ర్యాలీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యోగాంధ్ర అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏలూరు సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ నుంచి ఇండోర్ స్టేడియం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి చంటి, జేసీ పి.ధాత్రిరెడ్డి, మేయర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల

ఏలూరు(మెట్రో): జిల్లాలో వృద్ధిరేటు సాధన దిశగా జిల్లా, నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, విజన్ ప్లాన్‌ల అమలుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను కోరారు. అమరావతి నుంచి సోమవారం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల విజన్ ప్లాన్‌లను ముఖ్యమంత్రి వర్చువల్‌గా విడుదల చేశారు. కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించిన అనంతరం మంత్రి మనోహర్ జిల్లా, నియోజకవర్గ అభివృద్ధి విజన్ ప్లాన్‌పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లోని ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని మంత్రి మనోహర్ ప్రారంభించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సీపీఓ వాసుదేవరావు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 720 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులో సోమవారం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలకు 720 మంది అభ్యర్థులు హాజరయ్యారు. నగరంలోని సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం 180 మందికి 179 మంది, మధ్యాహ్నం 180 మందికి 159 మంది హాజరయ్యారు. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 200 మందికి 196 మంది, మధ్యాహ్నం 200 మందికి 186 మంది హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

11న చలో మంగళగిరి



ఏలూరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 11న చేపట్టిన చలో మంగళగిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. సోమవారం స్థానిక అన్నే భవనంలో కౌలు రైతుల చలో మంగళగిరి కరపత్రాలను ఆవిష్కరించారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేసి అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని, వడ్డీ లేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ఈనెల 11న మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రి నుంచి ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని కౌలు రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'సాక్షి' కార్యాలయాలపై దాడులు అమానుషం

గళమెత్తిన ఉద్యోగులు



ప్రత్తిపాడులోని సాక్షి యూనిట్ కార్యాలయం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సంస్థ ఉద్యోగులు



ఏలూరులో డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

పెంటపాడు: రాష్ట్రంలోని 'సాక్షి' కార్యాలయాలపై తెలుగుదేశం పార్టీ శ్రేణుల కుట్రపూరిత దాడులను ఖండిస్తూ పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం యూనిట్ ఉద్యోగులు గళమెత్తారు. సాక్షి మీడియాపై భౌతిక దాడులకు నిరసనగా పెంటపాడు మండలం ప్రత్తిపాడులోని సాక్షి యూనిట్ కార్యాలయం వద్ద సోమ వారం రాత్రి ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. 'సాక్షి'పై కుట్రపూరిత, అక్రమ దాడులను ఖండించాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పెద్ద ఎత్తున నినదించారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు

'సాక్షి' కార్యాలయాలపై దాడిని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని జర్నలిస్ట్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీడబ్ల్యూజే జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఏలూరులో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌కు, భీమవరంలో సీఐ నాగరాజుకు జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఫిర్యాదులు అందజేశారు. దాడులకు తెగబడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నూజివీడులో సీఐ సత్యశ్రీనివాస్‌కు, నరసాపురంలో ఎస్సై జయలక్ష్మికి, జంగారెడ్డిగూడెం స్టేషన్‌లో ఎస్సై జబీర్‌కి, తాడేపల్లిగూడెం స్టేషన్‌లోనూ మీడియా ప్రతినిధులు ఫిర్యాదులు చేశారు.

ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన

ఏలూరు టౌన్: ఏలూరు 'సాక్షి' కార్యాలయంపై టీడీపీ కూటమి నేతలు దాడులపై ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా 'సాక్షి' టీవీ జిల్లా ప్రతినిధి పోతురాజు మాట్లాడుతూ మీడియా కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి బీకే కిషోర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేలా కూటమి ప్రభుత్వం సీనియర్ జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించటాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం తన తీరు మార్చుకోవాలని, ఇదే తరహాలో అక్రమ కేసులు, దాడులు చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఉర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 'సాక్షి' టీవీ డిబేట్‌లో ఒక అంశానికి సంబంధించి జరిగిన చర్చ విషయమై సంబంధితులు క్షమాపణలు చెప్పినా ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని చెబుతున్నారని, ఇలాంటి చర్యలతో జర్నలిస్టులను భయభ్రాంతులకు గురిచేయటాన్ని తప్పుబడుతున్నామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఎల్రక్టానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు ఎస్.సంజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు వి.మధుసూర్యప్రకాష్, సీహెచ్ రామకృష్ణరాజు, ఫొటో జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే రియాజ్, సీనియర్ జర్నలిస్టులు గుండిమెడ రామచంద్రశర్మ, కర్రి అప్పలరాజు, వంశీధర్, ఎం.రాజేష్‌కుమార్, బి.భరత్‌కుమార్, గంజి చంటి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ రైతుల ఆక్రందన



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆయిల్‌పామ్ రైతులు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): పామాయిల్ దిగుమతి సుంకం 50 శాతానికి పెంచాలని, ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ ఆయిల్‌పామ్ రైతుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించడంతో ఆయిల్‌పామ్ గెలల ధరలు తగ్గి రైతులు నష్టపోతున్నారన్నారు. దేశంలోనే అత్యధిక ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం ఆంధ్రప్రదేశ్‌లో, రాష్ట్రంలోనే అధిక సాగు ఏలూరు జిల్లాలో ఉందని, రాష్ట్రంలో రైతులు, కూలీలు, కార్మికులు 10 లక్షలకు పైగా కుటుంబాలు ఆయిల్‌పామ్‌పై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య, ఆయిల్‌పామ్ రైతుల సంఘం నాయకులు గంటా పాపారావు, దాసరి జానకిరామరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఆయిల్‌ఫెడ్ కొత్త ఫ్యాక్టరీలు నిర్మాణం చేస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం ఆయిల్ ఫెడ్ కర్మాగారం అభివృద్ధి జరగలేదన్నారు. ఫలితంగా ఆయిల్ రికవరీ శాతం (ఓఈఆర్) తక్కువగా చూపడంతో రైతులు నష్టపోతున్నారని చెప్పారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



టీచర్ల దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ సాయి శ్రీనివాస్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు మాన్యువల్ విధానంలోనే కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఉపాధ్యాయుల నిరసనలతో ప్రభుత్వం దిగిరాక తప్పదని ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా కార్యాలయం వద్ద సోమవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. బదిలీల అంశంలో ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. తమ డిమాండ్ల సాధన కోసం మంగళవారం పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నామన్నారు. దీక్షల్లో పాల్గొన్నవారికి ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ మజ్జిగ ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఎస్టీయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేఆర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, రవికుమార్ రుద్రాక్షి, యూటీయూ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు విజయ రామరాజు, ఏపీటీఎఫ్ 1938 ఏలూరు జిల్లా అధ్యక్షుడు జి.మోహన్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.రమణ, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పీబీవీఎస్ఎల్ నారాయణ, వైఎస్ఆర్‌టీఏ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జైలు నిర్మాణ పనులను పరిశీలించిన డీఐజీ



కైకలూరులో పెట్రోలు బ్యాంకు పనులను పరిశీలిస్తున్న డీఐజీ వరప్రసాద్

కై కలూరు: కై కలూరులో నిర్మిస్తున్న జైలు, పెట్రోల్ బ్యాంకు నిర్మాణ పనులను జైళ్ల శాఖ డీఐజీ ఎం.వరప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల సంస్థల సూచనలతో ఖైదీలకు అన్ని సౌకర్యాలతో నూతన నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. గతంలో కొందరు ఖైదీలు స్నానాల గదుల్లో పైన ఊచలకు ఉరి వేసుకుని ఆత్మహత్యలు చేసుకునేవారన్నారు. అలాంటి సమస్యలు లేకుండా స్నానాల గదుల ఎత్తు తగ్గించి, పైన ఓపెన్‌గా ఉంచుతామన్నారు. పెట్రోలు బ్యాంకు వచ్చే నెలలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ డీఎస్‌జేవో ఆఫీస్ జైలర్ వి.ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామ ఉత్కర్ష అభయాన్ అమలుపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలో జాతీయ గ్రామ ఉత్కర్ష అభయాన్ పథకం పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పథకం అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంపై గిరిజనులకు అవగాహన కల్పించేందుకు జూన్ 15 నుంచి 30 వరకు జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల అవస్థలు











ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే మీ కోసం రద్దు చేశారు. ప్రజలు జిల్లా నలుమూలల నుంచి వారి సమస్యలు చెప్పుకుందామని వృద్ధులు, చంటిబిడ్డలను వేసుకుని తల్లులు కలెక్టర్‌ను కలిసి సమస్యలు పరిష్కరించమని వేడుకుందామని వచ్చారు. రద్దు చేశారని తెలిసి నిరాశగా వెనుదిరిగారు. ఎందుకు రద్దు చేశారో తెలియక మండుటెండలో ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడ్డారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతుడు నాగశ్రీనివాస్

కుక్కునూరు: బైక్ అదుపు తప్పడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుక్కునూరు గ్రామానికి చెందిన నాగ శ్రీనివాస్ ఆదివారం మధ్యాహ్న సమయంలో పొలం వెళుతుండగా, మోటార్‌సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయాడు. నాగశ్రీనివాస్ తలకు తీవ్ర గాయమైంది. భద్రాచలం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడకు రిఫర్ చేశారు. ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ నాగశ్రీనివాస్ మృతిచెందాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగశ్రీనివాస్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన బోను లక్ష్మీపతి(49) ఈ నెల 8న పనిమీద బైపాస్ రోడ్డు వద్దకు పనిమీద వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో స్థానిక తపస్ స్కూల్ సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. చికిత్స పొందుతూ 9వ తేదీ ఉదయం లక్ష్మీపతి మృతిచెందినట్లు హెచ్‌సీ తెలిపారు.

తాగునీటి వెతలు



గుండుగొలనులో దుర్వాసన కొడుతున్న వింధ్యవాసిని చెరువు నీరు



భీమడోలు పంచాయతీ వద్ద అడుగంటిన చెరువు నీరు

భీమడోలు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తింది. మంచినీటి చెరువుల నీటి మట్టాలు అడుగంటాయి. పంచాయతీలు తాగునీటిని సరఫరా చేయలేక గత 10 రోజులుగా బోరు నీరు కలిపిన నీటిని కొన్ని గ్రామాల్లో సరఫరా చేస్తున్నారు. మరిన్ని గ్రామాల్లో బోరు నీటిపైనే ఆధారపడుతున్నారు. గోదావరి కాల్వ మూసి 40 రోజులైంది. చెరువుల్లో అరకొరగా నింపడంతో పాటు వేసవి నీటి వినియోగం పెరగడంతో నీరు అడుగంటింది. దీంతో గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. గోదావరి కాల్వకు అనుకుని ఉన్న పూళ్ల, పాతూరు, కురెళ్లగూడెం, సూరప్పగూడెం, గుండుగొలను, కొల్లేరు గ్రామాల్లో మంచినీటి చెరువుల్లో నీటి మట్టాలు అడుగంటాయి. ఫిల్టర్ చేసి ఆ నీటిని సరఫరా చేయడంతో దుర్వాసన వస్తోంది. నెల రోజులు దాటితే తాగునీటి తీర్చే సామర్థ్యం తీర్చే చెరువులు లేవు. సమ్మర్ యాక్షన్

చెరువులలో అడుగంటిన నీరు

ప్లాన్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తాగునీరు ఇవ్వలేని దయనీయ స్థితిలో ఉన్నారని ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. గోదావరి కాల్వ పూడికతీత, కర్రనాచు తొలగింపు పనులు ఇంకా కొనసాగుతున్నాయి. దీంతో వారం రోజులు తర్వాత కాల్వకు నీటిని వదిలే అవకాశాలున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో మంచినీటి కోసం అల్లాడిపోతున్నారు. ప్రైవేటు వాటర్‌ను కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గుండుగొలనులోని వింధ్యవాసిని, బ్రాహ్మణ చెర్వులోని నీటి మట్టాలు పడిపోయాయి. బోరు నీరు, ఉప్పునీరు ఇవ్వడంతో ఈ నీటిని నిలుపుదల చేసి ట్యాంకర్ల ద్వారా నీటికి పంపిణీ చేయాలని భీమడోలు ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్ సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, ఎస్సీ ఏరియా, ఇతర ప్రాంతాలకు గత పది రోజులుగా బోరు నీరే ఇస్తున్నారని, విషయాన్ని ఇంచార్జి గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా గోదావరి కాల్వకు నీటిని విడుదల అయ్యే వరకు ఈ సమస్య పరిష్కారం కాదంటున్నారని ఫిర్యాదు చేసారు. ట్యాంకర్ల ద్వారా మంచి నీటిని సరఫరా చేయాలని ఎంపీడీవో, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ సమస్యపై గుండుగొలను ఇరిగేషన్ సెక్షన్ ఏఈ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా.. రెండు, మూడు రోజుల్లో గోదావరి నీరు గుండుగొలను సెక్షన్‌కు చేరుకుంటుందని.. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నందున ఉన్నతాధికారులు గోదావరి కాల్వకు నీటిని విడుదల చేశారన్నారు.

నివేదిత విద్యాలయం ఏర్పాటు అభినందనీయం



మొక్కలు నాటుతున్న కలెక్టర్ నాగరాణి, శారద మఠం అధ్యక్షురాలు

కాళ్ల: స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో నివేదిత విద్యాలయం ఏర్పాటు అభినందనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కాళ్ల మండలం పెద్ద అమిరంలో వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించిన నివేదిత విద్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సోమవారం కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విద్యాలయాన్ని కలెక్టర్, గుంటూరు శారద మఠం అధ్యక్షురాలు ప్రవాజిక భవాణి ప్రాణమాతాజీ ప్రారంభించారు. తరగతి గదులలో మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు విద్యతో పాటు విలువలతో కూడిన మన సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పి ఉత్తములుగా తీర్చిదిద్దటమే లక్ష్యంతో బాలికలకు ఉచిత విద్యాలయాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. శారద మఠం అధ్యక్షురాలు ప్రవాజిక భవాణి ప్రాణమాతాజీ మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు పేద బాలికలకు మాత్రమే విద్యను అందిస్తామన్నారు. సుమారు 770 మంది బాలికలకు ప్రవేశం కల్పించనునట్లు తెలిపారు. తెలుగుతో పాటుగా ఇంగ్లీష్ మీడియంలో కూడా ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు.

డాంగేనగర్‌లో అగ్నిప్రమాదం



దగ్ధమైన విద్యుత్ పరికరాలు, సామగ్రి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఉన్న డాంగే నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ హైవోల్టేజ్ రావడంతో పలువురి ఇళ్లలో విద్యుత్ పరికరాలు, సామగ్రి దగ్ధమయ్యాయి. దీంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. పాడుదోలు నాగేంద్రబాబు ఇంట్లో ఫ్రిడ్జ్, కూలర్, ఇన్వర్టర్లు, ఫ్యాన్‌లు, వైరింగ్, లైట్లు హైవోల్టేజ్ కారణంగా కాలిపోయాయి. ఇంట్లో సామగ్రి కూడా దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. శీలం మంగరాజు ఇంట్లో టీవీ, ఫ్యాన్‌లు, కలపాల శ్రీనివాస్ ఇంట్లో ఫ్యాన్‌లు, బల్బులు దగ్ధమయ్యాయి. విద్యుత్ శాఖ అధికారులు తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. సోమవారం విద్యుత్ శాఖ డీఈ యు.సుబ్బారావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

క్షీరా రామలింగేశ్వరుడికి సప్త ప్రదక్షిణలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో సప్త సోమవారాల ప్రదక్షిణలు ప్రారంభించినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ప్రదోషకాల సమయం 5.30 గంటలకు ప్రదక్షిణలు ప్రారంభించారు. ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ప్రదక్షిణలో సుమారు వేయి మంది భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు.

విద్యా రంగంలో ఆదర్శంగా నిలపాలి



షైనింగ్ స్టార్స్ అవార్డు అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రణాళిక బద్ధంగా విద్యారంగంలో వినూత్న మార్పులతో ఏలూరు జిల్లాను ఆదర్శవంతమైన జిల్లాగా నిలపాలని, అందుకు అనుగుణంగా సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం వట్లూరులోని సీఆర్ రెడ్డి ఇంజనీరింగు కాలేజీ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన షైనింగ్ స్టార్ కార్యక్రమాన్ని మనోహర్ ప్రారంభించారు. కార్యక్రమం ద్వారా ఏలూరు జిల్లాలోని 163 ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ 32,60,000, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ 6.80 లక్షలు చెక్కులు అందించి, సర్టిఫికెట్లతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని, విద్య ఒక్కటే అభివృద్ధికి మార్గమన్నారు. జిల్లాలో 2.78 లక్షలు విద్యార్థులు ఉండగా 1.30 లక్షల మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో 10 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారని వీరంతా ప్రణాళికాబద్ధంగా మరింత మెరుగైన విద్యను అందించడం ద్వారా జిల్లాను ఆదర్శంగా నిలపాలన్నారు. జూన్ 12 నుంచి పాఠశాలలో మధ్యాహ్నం భోజన పథకంలో పౌష్టికాహారం అందించేందుకు సన్న బియ్యం ప్రవేశపెడుతున్నామన్నారు. కలెక్టరు వెట్రిసెల్వి మాట్లాడుతూ డొక్కా సీతమ్మ పేరున మధ్యాహ్నం భోజనం పథకం ద్వారా మంచి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ పేరున విద్యార్థులకు పుస్తకాలు తదితర కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే బడేటి చంటి, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఆర్టీసీ రీజియన్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఎస్పీ కేపీఎస్ కిషోర్, జాయింటు కలెక్టరు ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు తనిఖీ

ఏలూరులోని షాపు నెంబర్ 74 చౌక ధరల దుకాణాన్ని, స్థానిక ఈదర సుబ్బమ్మ నగరపాలక ఉన్నత పాఠశాలను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్ ఇచ్చే బియ్యం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. 65 ఏళ్ల దాటిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ఇంకా డోర్ డెలివరీ పూర్తిచేయకపోవడంపై మంత్రి డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉద్యాన వర్సిటీతో శశి ఒప్పందం



ఉద్యాన వర్సిటీతో ఎంఓయు పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: విద్య, పరిశోధన, శిక్షణ రంగాల్లో పరస్పర సహకారానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, శశి ఇంజనీరింగ్ కళాశాల మధ్య సోమవారం ఎంఓయు కుదిరింది. విద్యార్థులకు పరిశోధన అవకాశాలు, పరిశ్రమ ఆధారిత శిక్షణ, ఇంటర్న్‌షిప్, జాయింట్ ప్రాజెక్టుల ద్వారా ప్రయోజనం పొందే అవకాశాలు ఈ ఎంఓయు ద్వారా కలగనుంది. విద్యారంగ అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, వ్యవసాయ, ఉద్యాన సాంకేతికల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. రెండు సంస్థల అభివృద్ధికి ఈ ఒప్పందం తోడ్పాటుగా నిలవనుందని ఉద్యాన వర్సిటీ వీసీ కె.గోపాల్, శశి వైస్‌చైర్మన్ మేకా నరేంద్రకృష్ణలు అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ కె.గోపాల్, డైరెక్టర్ ప్రోగ్రామ్స్ కె.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో 'కేజీఎఫ్' నటుడు



శ్రీవారి ఆలయంలో సినీ నటుడు గరుడారామ్, సుమ దంపతులు, దర్శకుడు సాయి శివాన్

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని కేజీఎఫ్ సినిమాలో విలన్‌గా నటించిన రామచంద్రరాజు (గరుడారామ్) సోమవారం సాయంత్రం సందర్శించారు. భార్య సుమ, సినీ దర్శకుడు సాయి శివాన్ జంపానతో కలసి ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గరుడారామ్ మాట్లాడుతూ ప్రస్తుతం వైరం చిత్రంలో మెయిన్ విలన్‌గా నటిస్తున్నట్టు చెప్పారు. ఆ చిత్రం వచ్చేనెలలో రిలీజ్ అవుతుందని తెలిపారు. దర్శకుడు సాయి శివాన్ మాట్లాడుతూ వచ్చేనెల మొదటి వారంలో పూరీ జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ హీరోగా తెరకెక్కనున్న ఇంటికో సైకో చిత్రానికి దర్శకుడిగా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు మండలం తంగెళ్ళమూడి భాగ్యనగర్ కాలనీలో గత నెలలో జరిగిన చోరీ కేసును వన్‌టౌన్ సర్కిల్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఛేదించారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. తంగెళ్ళమూడి భాగ్యనగర్ కాలనీకి చెందిన పడవల వెంకట శ్రీనివాస్ ఏపీ ట్రాన్స్‌కోలో పనిచేస్తున్నారు. మే నెల 26న కుమారుల చదువుల నిమిత్తం రాజమహేంద్రవరంలో అద్దె ఇల్లు చూసుకునేందుకు కుటుంబంతో కలిసి ఇంటికి తాళాలు వేసి వెళ్ళారు. పనులు ముగించుకుని సాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్ళి చూడగా బెడ్‌రూమ్‌లో బీరువా తాళాలు పగులగొట్టి దానిలోని బంగారు ఆభరణాలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. శ్రీనివాస్ ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు. సీసీ టీవీ ఫుటేజ్, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు సత్తినపల్లి రాకేష్‌ను సోమవారం మధ్యాహ్నం ఏలూరు హనుమాన్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నారు. పెదపాడు ఇందిరా కాలనీకి చెందిన రాకేష్ చోరీ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

12న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్: ఈ నెల 12న ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు రాష్ట్ర స్థాయి సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం –జంగారెడ్డిగూడెం జాతీయ ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. నీలాలమ్మ ఆలయ సమీపంలో ఈ రోడ్డు ప్రమాదం సంభవించిందని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. యర్రంపేట గ్రామానికి చెందిన రాపాక కల్యాణ్(26) జంగారెడ్డిగూడెం నుంచి టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై స్వగ్రామం వెళ్లేందుకు కొయ్యలగూడెం వైపునకు వస్తుండగా కారు ఢీకొంది. కల్యాణ్‌కు తీవ్ర గాయాలు కాగా.. వెంటనే జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్సులో తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతుడి తల్లి రాపాక మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.